హోమ్
స్వాగతం
సమాచారం
కళలు- సంస్కృతి
సహకారం
ట్రావెల్ & టూరిజం
తీరు-తెన్ను-మనసు
మన ఊరి కబుర్లు
సినిమా
తెలుగు లింక్స్
మా గురించి

More Stories>>>

# idontwantdowry.com

వి. నాగరత్న

కట్నంగురించి ఏంచేద్దాం? 'వరకట్న దురాచారము అంతమొందకపోగా నానాటికీ వికృతరూపము ధరించుచున్నది. అనేకమంది అమాయక ఆడపిల్లలు కట్నజ్వాలల్లోపడి ఆహుతౌతున్నారు...' అంటూ ఆరోతరగతి పిల్లల్తో కాంపోజిషన్ రాయిద్దామా? లేదా మనమే ఆ విషయమై కథలూ, నవల్లూ రాద్దామా? అందువల్ల ఏమైనా ఒరిగేదుందా? ఎవరేనా మారడం సంగతలా వుంచి అసలా టాపిక్ వింటే చాలు ఆమడదూరం పారిపోరూ?! కేరింతలు కొట్టే పాపాయిని ముద్దుచేస్తాంగానీ ఖళ్ళుఖళ్ళున దగ్గే తాతయ్య ఎవరికైనా ముచ్చట కలిగిస్తాడా? అంతెందుకు, 'అదనపు కట్నం ఇవ్వలేదని ఆలిని అడ్డంగా నరికి చంపిన వీరుడు', 'కట్నంవేధింపులతో మరో యువతి బలి', 'కాళ్ళ పారాణి ఆరకముందే..' తరహాలో నిత్యం వచ్చే క్రైమ్‌వార్తలు ఏమైనా ఆసక్తిగా వుంటాయా? పక్కింట్లోనో, ఎదురింట్లోనో ఇలాంటి దారుణాలు జరుగుతూనే వుంటాయి. లేదా పుట్టింటినుంచి ఇంకాఇంకా డబ్బు తెమ్మని తన్నితగలేసే భర్తాగ్రేసరుల్ని చూసీచూసీ ఇది చాలా సాధారణం అనుకునే స్థాయికి ఎదిగిపోతాం లేదా బండబారిపోతాం. మానవి, భూమిక లాంటి స్త్రీవాద పత్రికల్లోనూ, దినపత్రికల విమెన్స్‌పేజీల్లోనూ మహిళలు అనుభవిస్తోన్న చిత్రహింసలు, చవిచూస్తోన్న సవాలక్ష సమస్యల ప్రస్తావన వస్తే కొన్నిసార్లు జాలిపడి గుండెభారంగా అవుతుంది. ఎక్కువసార్లు 'అలాంటి నీచుల్ని అసలెందుకు చేసుకోవాలి? పోనీ తెలీక చేసుకుంటే రాక్షసుడని తెలిశాక్కూడా కలిసుండనేల? ఇంత తెలివితక్కువ మేళాలేంటి అని చిరాకుపడ్తాం. ఇంతకీ అసలేం చేద్దాం?! ఇలాంటి విషయాలు వినడానికి, చెప్పుకోడానికీ కూడా పరమ రోతగా వుంటాయే. అలాని వదిలేయడమేనా?!

ఆడవాళ్ళపక్షంగా చట్టాలున్నాయి. కట్నం అడిగితే, ఆ విషయమై భర్త లేదా అతని సంబంధీకులు ఇబ్బందిపెడ్తే నేరం! డౌరీ హెరాస్‌మెంట్ అంటూ సెక్షన్ 498ఎ వుంది. కానీ న్యాయపరిరక్షకులైన లాయర్లూ, పోలీసులూ ఆఖరికి న్యాయమూర్తులు కూడా వీటికి మినహాయింపు కారే! వాళ్ళు సైతం కట్నకానుకలు ఇస్తున్నారు, పుచ్చుకుంటున్నారు. ఇక మామూలువాళ్ళు ఇవ్వనంటే కుదుర్తుందా? అట్నే అడిగేవాణ్ణి చేసుకోనని మొరాయిస్తే ధీరవనిత కాదు తలబిరుసని కితాబిస్తారు. సరే ఇలాంటివన్నీ వినీవినీ వినిగిపోయి, పడీపడీ తల బొప్పికట్టి 'ఇంతేలే, ఈ రొచ్చిలాగే వుంటుంది.. ఈ రొంపిలో ఈదులాడాల్సిందే' అని నిరాశతో కొట్టుకుపోతున్నదశలో హైద్రాబాద్‌కు చెందిన శ్రీ సత్యనరేష్ 'ఐ డోంట్ వాంట్ డౌరీ డాట్ కాం' అంటూ ఓ వెబ్‌సైట్ ప్రారంభించారు. చప్పుపుచ్చు భావాలతో నాటు ఆచారాల్లో కొట్టుకుపోయేవాళ్ళనొదిలేస్తే కొందరైనా యువకులు 'అవును, మాకేం కట్నమక్కర్లేదు, స్వశక్తితో బ్రతుకుతాం' అంటూ అందులో సభ్యులుగా చేరడం ఎంత ముచ్చటేసే విషయం కదూ! పైగా బాగా చదువుకుని ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డ ఘటికులైన అబ్బాయిలు కూడా అలా అంటున్నారంటే ప్రశంసించి తీరాల్సిందే.

కాసేపు రోడ్డుమీద నిలబడి ఆకాశంకేసి తీక్షణంగా చూస్తూ నిలబడండి. ఆ చుట్టూ వెళ్తోన్న అనేకమంది మీరు దేనికోసం చూస్తున్నారో తెలీకపోయినా, అక్కడేమీ కనపడకపోయినా వాళ్ళూ కన్నార్పకుండా అటే చూస్తారు. అలాంటిదీ అభ్యుదయభావాలతో నలుగురు యువకులు తమ పేరు

ఇందులో నమోదు చేసుకుంటే వాళ్ళని చూసి ఇంకొందరు, మరికొందరు అనుసరించరేంటి?! ఇప్పుడదే జరిగింది.

అబ్బాయిలు తాము ప్యారసైట్లు కాదని, భార్య తరపువారిచ్చే సొమ్ముతో జీవింతే అగత్యం లేదని, స్వశక్తితో ఎంచక్కా బ్రతగ్గలమని నిరూపించుకుంటున్నట్లుగా 'ఐ డోంట్ వాంట్ డౌరీ డాట్ కాం'లో సభ్యులౌతున్నారు. ఇక ఆడపిల్లలు కూడా తమ తల్లిదండ్రుల్ని పీడించి జలగల్లా డబ్బు గుంజే లేదా తమ వెనుక ఉన్న ఆస్తిపాస్తుల్ని చూసి వచ్చే వరుడు అక్కర్లేదని, తమని తాముగా ఇష్టపడే మొనగాడే కావాలని ధైర్యంగా చెప్తున్నారు. అలాంటి వ్యక్తి తారసపడకపోతే పెళ్ళి మానేయడమే ఉత్తమం అనీ వాదిస్తున్నారు. ఇది నిజంగా భుజం చరితే భలే అంటే సరిపోని గొప్ప మార్పు. సునీతావిలియమ్స్ లాంటి ధీరవనితలు స్పేస్‌లోకి దూసుకెళ్తోన్న తరుణంలో కూడా అనేకమంది ఆడపిల్లలు పెళ్ళి దగ్గరికొచ్చేసరికి తలొంచి తాళి కట్టించుకోవడం, ఇక అతను ఆడించినట్టల్లా ఆడూ్త తన ఉనికినే మర్చిపోవడం ఎంత దుర్భరం?!

'ఐ డోంట్ వాంట్ డౌరీ డాట్ కాం' చేసిన ఈ ఆలోచన నిజంగా ఉదాత్తమైంది. కానీ అంతకంటే అత్యవసరమైన పని ఇంకోటి మిగిలుంది. కట్నం ప్రసక్తి లేనంతలో ఆ జంట అరమరికలు లేకుండా వుంటారని ఎంతమాత్రం భరోసాలేదు. అదేం చిత్రమో కానీ అటు పెద్దలు కుదిర్చిన పెళ్ళిల్లోనూ, ఇటు వాళ్ళే ఇష్టపడి చేసుకున్న ప్రేమ పెళ్ళిళ్ళలోనూ కూడా ఆలుమగలైన మరుక్షణంనుంచీ అయ్యగారు యజమానైపోతాడు. భార్య ముక్కుకు తాడేసి ఆడిస్తుంటాడు. అమ్మాయేమో నిసలైన పనిమనిషిలా స్థిరపడిపోతుంది. దీనికి ఫెమినిజం అని పేరెడ్తే చేయగల్గిందేం లేదు. కూలీలమీద మనం పెత్తనం చేస్తుంటాం. వాళ్ళకి ఇవ్వాల్సింది నిజాయితీగా అంచనా వేయకుండా అతి చవగ్గా మాట్లాడుకుంటాం. ఆ సొమ్ము ఇవ్వడమే ఔదార్యమన్నట్లు దర్పం వెలగబెడ్తాం. ఇదెంత దోపిడీనో, భార్యలమీద చేసేదీ అంతే దౌర్జన్యం. ఇక్కడ బాధితులపక్షం వహించే హ్యూమనిజమే తప్ప ఫెమినిజం కానేకాదు.

కనుక ఇదివరలో చెప్పిందే మరోసారి చెప్తున్నాను. 'ఐ డోంట్ వాంట్ డౌరీ డాట్ కాం'వారు మరో అడుగు ముందుకేసి 'వియార్ ఫ్రెండ్స్ డాట్ కాం' అంటూ ఓ వెబ్‌సైట్ మొదలెడ్తే లక్షలాదిమంది ఆడపిల్లలు సంతోషిస్తారు. పెళ్ళయ్యాక పెత్తనం చెలాయించకుండా స్నేహితుడిలా వుంటానని చెప్పగల్గే అబ్బాయిలకోసం ఓ వేదిక కల్పిస్తే.. అలాంటి పురుషపుంగవులు ముందుకొస్తే అంతకంటే ఆనందకరమైన విషయం ఇంకేదైనా వుంటుందా?! అప్పుడిక జంటలు 'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు / నీ కోసమె జీవించుటకు / నేనున్నానని నిండుగ పలికే తోడొకరుండిన / అదే భాగ్యమో... అదే స్వర్గమో!!' అని సంబరంగా పాడుకోరూ?!

© 2006 Snehabharati.com. All rights reserved.
Best viewed with the Screen Resolution of 1024 x 768.